అధ్వానంగా రెడ్ క్రాస్ భవనం

- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసుల వేడుకోలు

పట్టణంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనం

మెట్‌పల్లి, మే 19: ఒకప్పుడు నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో సందడిగా కనిపించే రెడ్ క్రాస్ సొసైటీ భవనం నేడు బోసిపోతున్నది. మెట్‌పల్లి పట్టణంలోని 63వ జాతీయ రహదారిని ఆనుకుని దాదాపు 50 ఏండ్ల కిందట రూ. లక్షల వ్యయంతో నిర్మించిన రెడ్ క్రాస్ భవనం కొంత కాలంగా నిర్వహణ కొరవడి, కనీస మరమ్మతులకు నోచుకోలేక శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్నది. పగుళ్లు తీసిన గోడలు, స్లాబ్ కింది బాగాన పెచ్చులూడి తేలిన సలాక, వానలు కురిసినప్పుడు స్లాబ్‌పై నుంచి కిందకు ఊరుస్తూ తడిసి ముద్దవుతున్న గోడలతో భవనం దుస్థితి దయనీయంగా కనిపిస్తున్నది. మరమ్మతులు చేయించాల్సిన రెవెన్యూ విభాగం అధికారులు సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణం నడిబొడ్డున గల ఈ భవనానికి మరమ్మతులు చేపడితే ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు అధికారిక సభలు, సమావేశాలు, ఇతరత్రా శిక్షణ తరగతుల నిర్వహణకు ఉపయోగపడే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా సంబంధిత అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడం లేదు. ఆలనా.. పాలన లేకపోవడంతో భవనం ఆవరణ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా మారింది. మరోవైపు పందులు, కుక్కలు, ఇతర జంతువులకు స్థావరంగా మారింది. మంచి ఆశయంతో భారత రెడ్ క్రాస్ సొసైటీ మెట్‌పల్లి తాలూకా విభాగం ఆధ్వర్యంలో సుమారు ఆరు గుంటల స్థలంలో రెడ్‌క్రాస్ భవనం నిర్మించారు. దీనిని 1979 మార్చి 19న అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడం, జనవాసాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉండడంతో అందులో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతూనే ఉండేది. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ప్రైవేట్ కార్యక్రమాలు, శుభకార్యాలు నిర్వహించేవారు. కాలక్రమేనా ఆదరణ కోల్పోయి నిరుపయోగంగా మారింది. భవనానికి శాశ్వత మరమ్మతులు చేపడితే ప్రభుత్వ, ప్రైవేట్‌కు సంబంధించిన కార్యక్రమాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సత్తక్కపల్లిలో 'విద్యుత్' వివాదం

- చెట్లకొమ్మలు కొడుతుండగా విద్యుత్ సరఫరా చేయడంపై గ్రామస్తుల ఆగ్రహం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

పోలీసు వాహనాన్ని ముట్టడించిన గ్రామస్తులు

మెట్‌పల్లి రూరల్, మే 19: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామంలో ఎల్సీ తీసుకొని చెట్లకొమ్మలు కొడుతుండగా, అర్ధాంతరంగా విద్యుత్ సరఫరా చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. సత్తక్కపల్లి గ్రామంలో శనివారం విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లకొమ్మలను కొట్టేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఈమేరకు గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైక్ ద్వారా ప్రచారం చేశారు. అనంతరం ఎల్సీ తీసుకొని పొలాలు, తోటల వెంబడి విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లకొమ్మలను కొడుతున్నారు. కాగా, నిర్ణయించిన సమయం కంటే ముందే విద్యుత్ సరఫరా నిలిపివేశారని, ఇంట్లో నీళ్లు లేవని గ్రామానికి చెందిన మాదస్తు రాజేశ్ విద్యుత్ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తులకు సమాచారం ఇచ్చి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు సిబ్బంది తెలిపారు. కాగా, తమకు సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని, ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారంటూ గ్రామస్తులు శనివారం రాత్రి మాదస్తు రాజేశ్ ఇంటిని ముట్టడించారు. రాజేశ్‌తో పాటు ట్రాన్స్‌కో డీఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని సముదాయించారు. అయితే, ఆదివారం కూడా గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మెట్‌పల్లి సీఐ నవీన్, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ గ్రామానికి వెళ్లి రాజేశ్‌ను తమ వాహనంలో కూర్చోబెట్టారు. గ్రామస్తులు పోలీసు వాహనాన్ని ముట్టడించి రాజేశ్ తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజేశ్ క్షమాపణ చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. అలాగే, ట్రాన్స్‌కో డీఈ సైతం వచ్చి క్షమాపణ చెప్పాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వంతెనపై బోల్తాపడిన లారీ, వ్యాన్‌ను క్రేన్ల సహాయంతో తొలగిస్తున్న పోలీసులు

రోడ్డుపై కిలో మీటర్ మేర నిలిచిన వాహనాలు

పూడూర్ వంతెనపై లారీ, వ్యాన్ ఢీ

- వ్యాన్ డ్రైవర్ దుర్మరణం
- శనివారం అర్ధరాత్రి 1.40 గంటల ప్రాంతంలో ఘటన
- జగిత్యాల-కరీంనగర్ రహదారిపై నిలిచిన రాకపోకలు

కొడిమ్యాల, మే 19: మండలంలోని పూడూర్ వంతెనపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ప్రమాదం జరిగింది. లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. కొడిమ్యాల ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన దామెర రాజేశ్వర్‌రెడ్డి (39) తన వ్యాన్‌లో పాలు, పెరుగు లోడ్ చేసుకొని నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌కు వెళ్తున్నాడు. రాజస్థాన్‌కు చెందిన లారీ జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వాష్ బేషిన్లు, బాత్రుం వెస్టర్న్ కమోడ్ల లోడ్‌తో వస్తున్నది. పూడూర్ వంతెనపైకి రాగానే లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొని బోల్తాపడ్డాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ రాజేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు వాహనాలు రోడ్డుపై పడిపోవడంతో జగిత్యాల-కరీంనగర్ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను అప్పారావుపేట మీదుగా మళ్లించారు. భారీ వాహనం తగలడంతో 11 కేవీకే కరెంట్ తీగ తెగి రోడ్డుపై పడ్డది. దీంతో కిలోమీటరు పొడువునా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు 8 గంటలు శ్రమించి వాహనాలను క్రేన్ల సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా, రాజేశ్వర్‌రెడ్డి భార్య వనజ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ వీరం భాయ్ గమరపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, బ్రిడ్జిపై పడిన పెద్దగుంత కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

నూతన కార్యవర్గం

రాయికల్, మే 19: రాయికల్ మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

మెట్‌పల్లి, మే 19: మెట్‌పల్లి పట్టణ ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దొంతుల చిన్నయ్య ఎన్నికయ్యారు.

రేషన్ బియ్యం పట్టివేత

సారంగాపూర్, మే 19: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ గౌతమ్ పవార్ తెలిపారు. బియ్యం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బియ్యం నిల్వ చేసిన బీర్‌పూర్‌కు చెందిన సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సృజన్‌రావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చెన్నమనేని వికాస్‌రావు

బాధిత కుటుంబానికి పరామర్శ

మేడిపల్లి, మే 19: మేడిపల్లికి చెందిన ఎన్నమనేని సృజన్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను ఆదివారం బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్ గౌడ్, నాయకులు క్యాతం దశరథరెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, గోస్కి మధుసూదన్, మామిడి ధర్మారెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

మాట్లాడుతున్న మచ్చ శంకర్

జగిత్యాల, మే 19: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను వేసవి సెలవులు ముగిసేలోగా పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయుల పదోన్నతులు లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతేడాది నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసి బదిలీ అయి రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే వారికి కేటాయించిన స్థానాలకు పంపాలన్నారు. పండిత, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విద్యామణి కృష్ణ, తాటి పర్తి దశరథ్ రెడ్డి, గుండెల నరేశ్, మేకల ప్రవీణ్, బండి శ్రీనివాస్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జ్ఞాన యజ్ఞ ముగింపు ఉత్సవం

కోరుట్ల, మే 19: పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో గీతా సత్సంగ్ ఆధ్వర్యంలో గీతా జ్ఞాన యజ్ఞ సమాపనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు గీతా పఠనం, భగవాన్ నామ సంకీర్తనలు ఆలపించారు. భగవద్గీత పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భగవద్గీత జ్ఞాన యజ్ఞం ప్రవచనకర్త ఛత్రపతిని సత్కరించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సంచాలక్ శంకర్, అఖిలాంధ్ర సాధు పరిషత్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వరానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే కొనుగోళ్లలో జాప్యం

కథలాపూర్/మేడిపల్లి, మే 19: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ధాన్యం తూకంలో జాప్యం జరుగుతున్నదని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. కథలాపూర్ మండలం పోసానిపేట, మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయాచోట్ల వికాస్ రావు మాట్లాడారు. వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. అనంతరం కథలాపూర్‌కు చెందిన యటకర్ల అమృత ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి, కథలాపూర్ మండలాల బీజేపీ నాయకులు కంటె సత్యనారాయణ, ముంజ శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్, జీవన్‌రెడ్డి, దశరథరెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, గోస్కి మధుసూదన్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వితను సన్మానిస్తున్న అలయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రతిభావంతురాలికి సత్కారం

కోరుట్ల రూరల్, మే 19: కల్లూరు గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాల విద్యార్థి అశ్విత 10 జీపీఏ సాధించగా, ఆదివారం స్థానిక సినారె కళాభవనంలో అశ్వితను అలయన్స్ క్లబ్ సభ్యులు బాలగంగాధర శాస్త్రి, కటుకం రాజేంద్రప్రసాద్ శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్‌క్లబ్ సభ్యులు కట్కం సురేందర్, కైలాస నాగేశ్వర్, గోనె శ్రీహరి, కట్కం మల్లికార్జున్, పాటిల్ ధరందీప్, ఎల్లారెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

జగిత్యాల/జగిత్యాల రూరల్, మే 19: రాష్ట్రంలో కుల గణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 48 శాతానికి పెంచుతామన్న హామీ నెరవేర్చాలని, కుల గణన చేపట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అలిశెట్టి ఈశ్వరయ్య, కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్, హృషికేశ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

నగదు అందజేస్తున్న దాతలు

జగిత్యాల, మే 19: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమానికి పలువురు దాతలు విరాళం ఇచ్చినట్లు ఆశ్రమం నిర్వహకుడు సూరజ్ శివ్ శంకర్ తెలిపారు. పట్టణంలోని చిలుకవాడకు చెందిన తిప్పర్తి కృష్ణసాగర్-ప్రణవి దంపతులు రూ.5 వేలు, కోరుట్లలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన క్యాతం వెంకటయ్య-లక్ష్మి దంపతులు రూ.5 వేలు అందజేశారు. దాతలకు ఆశ్రమం నిర్వహణ కమిటీ సభ్యులు గిరి నాగభూషణం, బాపురెడ్డి, సత్తయ్య, బాలె శంకర్, సుదర్శన్, గౌరీశంకర్, ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిప్పర్తి ఆంజనేయులు, రాధ, అశోక్, చక్రవర్తి, సందీప్ కుమార్, నవ్యశ్రీ, తిరుపల్లి రోజా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

రాయికల్, మే 19: రాయికల్‌లోని ఆగ్రోస్ కేంద్రం, రాయికల్, భూపతిపూర్ సహకార సంఘాల్లో పచ్చిరొట్ట విత్తనాలు ఉన్నట్లు ఏవో ముత్తేశ్వర్ తెలిపారు. 30 కిలోల బ్యాగ్‌కు సబ్సిడీ పోనూ ధర రూ.1116 ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మే 19: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 8 వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించాలి

కలెక్టరేట్, మే 19 : పెన్షనర్లకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య సేవలు, అత్యుత్తమమైన హాస్పిటళ్లలో నగదు రహిత చికిత్స ద్వారా అందించాలని తెలంగాణ పెన్షనర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

దుబాయ్‌లో జగిత్యాల వాసికి పెద్ద కష్టం

- చీటింగ్ గ్యాంగ్ చేతికి చిక్కి.. మోసపోయిన వలస జీవి
- వాళ్లు చెప్పినట్లు బ్యాంక్ ఖాతాలు తీసి కేసుల పాలు
- ట్రావెల్ బ్యాన్ విధించిన అక్కడి పోలీసులు
- బాధితుడికి అండగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- సాయం చేయాలని ఇండియన్ కాన్సులేట్‌కు సమాచారం

జగిత్యాల, మే 19: ఉద్యోగం కోసం వలస దేశం వెళ్లి, అక్కడి దొంగల ముఠా ఉచ్చులో చిక్కుకొని, కేసుల పాలై జగిత్యాల వాసి అష్టకష్టాలు పడ్డాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సంప్రదించగా బాధితుడికి సాయం చేయాలని ఇండియన్ కాన్సులేట్‌కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలలోని కటికె వాడకు చెందిన గొల్లపెల్లి రాజేశ్ (39) బతుకుదెరువు కోసం గతేడాది డిసెంబర్‌లో దుబాయ్‌కి వెళ్లాడు. ఎంప్లాయ్‌మెంట్ వీసా ఉన్నప్పటికీ సరైన ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా, కొందరు వ్యక్తులు పరిచయమయ్యారు. బ్యాంకుల ద్వారా అప్పు తీసుకుని ఏదైనా బిజినెస్ చేయొచ్చని సలహా ఇచ్చారు. రాజేశ్ అవసరాన్ని ఆసరాగా చేసుకొని, అతన్ని నమ్మించి ఆరు బ్యాంకుల్లో ఖాతాలను తీయించారు. డెబిట్ కార్డులు, చెక్ బుక్కులు ముఠా సభ్యులే తీసుకున్నారు. అయితే రాజేశ్ బ్యాంకు ఖాతాలు అనుమానాస్పదంగా ఉండడంతో అక్కడి పోలీసులు దర్యాప్తు చేసి, క్రిమినల్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు పూర్తయ్యే దాకా దుబాయ్ దాటి వెళ్లకుండా ట్రావెల్‌బ్యాన్ (ప్రయాణ నిషేధం) విధించారని వివరించారు. రాజేశ్ కుటుంబసభ్యులు ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాజేశ్‌ను కాపాడాలని వేడుకోగా, ఆయన స్పందించారు. విషయాన్ని సీఎంవో కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, తగిన సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్, ఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యాలయానికి ఈ నెల 18న వైర్ లెస్ మెస్సేజ్ పంపించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. సోమవారం మరోసారి రాజేశ్ కుటుంబ సభ్యులు జగిత్యాలకు వచ్చి జీవన్‌రెడ్డిని కలిసి వేడుకోగా, వారి వద్ద ఉన్న పత్రాలు పరిశీలించి సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

23న ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం

కమాన్‌చౌరస్తా, మే 19 : పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 84 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 10 జీపీఏ సాధించిన 80 మంది విద్యార్థులకు పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులను ప్రదానం చేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతి రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, రవీందర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుంది

కొత్తపల్లి, మే 19 : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగిలి గద్దె దిగడం ఖాయమని వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్ విమర్శించారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యానికి కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులను అరిగోస పెడుతున్నారని దుయ్యబట్టారు. సకాలంలో పంట పొలాలకు నీరు ఇవ్వకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, పండించిన పంటను సైతం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

రక్తదానం

మేడిపల్లి, మే 19: ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామానికి చెందిన చిన్న రాజయ్య అనారోగ్యంతో కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ ఆనందరావు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం 'ఏ' పాజిటివ్ రక్తం అవసరం కాగా, కుటుంబసభ్యులు భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జీర్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్‌ను సంప్రదించారు. ఆయన సూచన మేరకు సంస్థ సభ్యుడు పింజరి రాహుల్ ఆదివారం దవాఖానకు వెళ్లి రక్తదానం చేశాడు. రాహుల్‌ను అంగడి ఆనంద్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, డాక్టర్లు అభినందించారు.

ఈతవనం దగ్ధం

కోరుట్ల రూరల్, మే 19: చిన్నమెట్పల్లిలో ఈతవనానికి ఆదివారం నిప్పంటుకొని దగ్ధమైంది. సుమారు 1500 ఈత చెట్లు దగ్ధమైనట్లు గీతకార్మికులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల రూరల్, మే 19: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్, గుల్లపేట, కన్నాపూర్ 11కేవీ ఫీడర్ల పరిధిలోని నర్సింగాపూర్, వంజరిపల్లి, గుల్లపేట, కన్నాపూర్ గ్రామాలకు సోమవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కోరుట్ల, మే 19: పట్టణంలోని ప్రకాశం రోడ్డు, అయిలాపూర్ రోడ్డు, చిన్నతోటవాడ, గాంధీనగర్, జూనియర్ కళాశాల గ్రౌండ్ ఏరియా, ఐబీ రోడ్డు ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులుసహకరించాలని కోరారు.

సారంగాపూర్, మే 19: పోతారం పంచాయతీ పరిధిలో గల గణేశ్‌పల్లి 11 కేవీ ఫీడర్ సమీపంలో సోమవారం తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏఈ సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేశ్‌పల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చిన్నారి ప్రతిభ

హంసినికి మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

కొడిమ్యాల, మే 19: మండల కేంద్రానికి చెందిన కొట్టాల హంసిని రెడ్డి తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శనివారం తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన అన్నమయ్య సంగీత నృత్యోత్సవాల్లో ప్రతిభ చూపింది. చేతిలో దీపాలతో రింగును బ్యాలెన్స్ చేస్తూ బిందెపై హంసిని చేసిన నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. హంసినికి ఉత్సవాల నిర్వాహకులు మెమొంటో అందజేశారు. కాగా, హంసినిని ఆదివారం గ్రామస్తులు అభినందించారు.

మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా రఫీ

మల్లాపూర్, మే 19: కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మహ్మద్ రఫీ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సిరాజుద్దీన్ మన్సూర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణారావు రఫీకి ఉత్తర్వు పత్రం అందజేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 19: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల